ఓం నమో భగవతే శ్రీరమణాయ

# రమణభాస్కర

## (ఐభీమవరంలో శ్రీనాన్నగారి ప్రవచనము, 18-11-96)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

నేను పూజ, జపం, ధ్యానం చేసుకొంటున్నాను. మనస్సు హృదయంలో ప్రవేశించటంలేదు. హృదయాకారం చెందటంలేదు అని ఒక భక్తుడు భగవాన్‌ను ప్రశ్నించాడు. మనస్సు అనేది ఒకటి ఉందని, అది చాలా బలంగా ఉందని కత్తులతో దానిని చంపటానికి వెళ్ళేబదులు దాని మూలాన్ని వెదికితే అది నశిస్తుంది. ఇలా చేసుకోవటం మంచిది. ధ్యానంచేసి దానిని జయించాలిఅని ధ్యానం అనే యుద్ధం ప్రారంభించగానే మీరుచేసేపని మీరుచేస్తూఉంటే దానిబలం అది చూపిస్తుంది. ఒక శత్రువుతో మనం పోరాడేటప్పుడు వాడికి ఎంతబలం ఉందో అది చూపించకుండా వాడు నశించడు. మనస్సుతో యుద్ధంచేసేబదులు దాని మూలాన్ని వెతికితే అసలు మనస్సే లేదన్నసంగతి అనుభవం అవుతుంది. మనస్సు లేకపోతే ఆత్మను తెలుసుకోలేము అని చాలామంది అనుకొంటున్నారు. ఆత్మను తెలుసుకోవటానికి మనస్సు ఉండనక్కరలేదు. ఆత్మ ఉండటంవలననే అది తెలియబడుతుంది. మనస్సుకు లేనిపోని విలువ ఇస్తున్నాము. మనస్సు గొడవలోనికి వెళ్ళకండి దానిని పట్టించుకోకపోతే అది నశిస్తుంది. మీపూర్వజన్మ గొడవలు, వాసనలు, అలవాట్లు అన్నీ మనస్సులో ఉన్నాయి. అందువలన ఏదో గొడవ మిమ్మల్ని ప్రేరేపిస్తుంది. గురువు చెప్పిన మాటలను ప్రమాణంగా తీసుకోవాలిగాని మనస్సు చెప్పినమాటలను ప్రమాణంగా తీసుకోకూడదు. మొత్తం గొడవ అంతా మనస్సులో ఉంది. దానితో పోరాటం అంత తేలిక కాదు. దానిమూలం వెదికితే అది నశిస్తుంది. అసలు దేవుని అనుగ్రహం లేకపోతే మనోమూలాన్ని వెదకాలనే తలంపుకూడా మీకు రాదు. మనోమూలం వెదకాలి, చైతన్యానుభవం పొందాలి, ఈ జననమరణ ప్రవాహంనుండి ఒడ్డుకు రావాలి, జన్మరాహిత్యస్థితిని పొందాలి అనే సంకల్పం మీకు వస్తే మీకు దేవుని అనుగ్రహం ఉన్నట్లే గుర్తు. ఎన్ని సంపదలు ఉన్నా పూర్వపుణ్యం లేకపోతే మనోమూలం వెదకాలి అనే బుద్ధి మనకు కలుగదు.

నీప్రాణగతిని చూసుకో. లోపలకు వెళ్ళేగాలిని, బయటకు వచ్చేగాలిని కొంచం మనస్సును అక్కడ నిలబెట్టి చూడు. అలాగ గాలిని చూస్తూఉంటే నీ మనస్సుకు కొంచం ఏకాగ్రత వస్తుంది. నీ మనస్సు పైపైన కొట్టుకొనిపోతోంది. లోకంలోని విషయాలను చూస్తూ నీ మనస్సు తేలి వెళ్ళిపోతోంది.దేవుడు పైన లేడు లోపల ఉన్నాడు. నీ మనస్సును లోపలకు దింపాలి. దానికి బరువు కావాలి. బరువు వూరికే రాదు. సత్పురుషుల సహవాసం చెయ్యాలి. ప్రాణాయామం చెయ్యాలి, మంచి గ్రంధాలు చదవాలి. అప్పుడు మనస్సుకు తూకం పెరిగి దాని పుట్టుచోటుఅయిన హృదయంలో మునిగిపోతుంది. అందరికి సూక్ష్మదృష్టి ఉండదు ఎక్కువమందికి స్థూలదృష్టి ఉంటుంది. స్థూలదృష్టి ఉన్నవారు ప్రాణగతిని చూస్తూ ఉంటే మనస్సుకు తూకం పెరుగుతుంది. మీ మనస్సును డైరక్టుగా పరిశీలన చేసుకొంటే మంచిదే అలా చెయ్యలేకపోతే ప్రాణాయామం ఉపయోగపడుతుంది. మీరు ప్రాణాన్ని ఎప్పుడైతే స్వాధీనం చేసుకొంటున్నారో మీకు తెలియకుండానే మీ మనస్సు అణగటం ప్రారంభిస్తుంది. దేహవాసన, శాస్త్రవాసన, లోకవాసన లేకుండా భగవాన్ చెపుతారు. ఆయన టీచింగ్‌లో ఉన్న ప్రాముఖ్యత అది. ఆయన హృదయంలో ఉన్న అనుభవాన్ని తీసి మనకు అందిస్తారు. ఆయన టీచింగ్‌ను ఆకాశగంగ అని చాలామంది అంటారు.

నీ మనస్సును హృదయంలోనికి పంపటానికి నీవు సాధనచేస్తున్నావు. అది వెళ్లనంటోంది. నీ మనస్సు హృదయంలోనికి వెళ్ళకుండా నీ వాసనలే అడ్డు వస్తున్నాయి. నువ్వు చేసిన పనులే అడ్డుకొంటున్నాయి. నీవు చేసినదే నీకు ఎదురొస్తోంది. నీ సాధనాబలం తక్కువగా ఉంది, వాసనాబలం ఎక్కువగా ఉంది. అందువలన నీ మనస్సు లోపలకు వెళ్ళటంలేదు. వాసనలు సన్నగిల్లకుండా, బలహీనపడకుండా నీవు సాధనలో ముందుకు వెళ్ళలేవు. పునర్జన్మ కారణములు అన్నీ నీ మనస్సులో ఉన్నాయి. ప్రాణాయామంద్వారాగాని, సత్పురుషుల సహవాసంద్వారాగాని, పూజ, జపం, ధ్యానం, విచారణద్వారాగాని ప్రయాణంచేసి పునర్జన్మ హేతువులను తొలగించుకోవాలి. నీకు ఏది ఇష్టమో ఆమార్గంద్వారా ప్రయాణంచెయ్యి. నీవు వాసనా రాహిత్యస్థితిని పొందాలి. నీ శరీరంలో ఉన్న ప్రాణం బయటకు పోకముందే ఈ వాసనలను తొలగించుకోవాలి. లేకుంటే నీకు పునర్జన్మ వచ్చితీరుతుంది. సత్పురుషుల సాంగత్యంవలన వాసన నశిస్తుంది. సత్పురుషులదగ్గరకు వెళ్ళి ఆధ్యాత్మిక పురోగతికి సహకారం చెయ్యండి అని మీరు అడగనక్కరలేదు. వారి స్వధర్మం అదేకాబట్టి నీవు అడగకుండానే వారి వైబ్రేషన్స్ నీమీద పడతాయి. దానివలన నీలోని వాసనలు తొలగింపబడతాయి. బాహ్యాముఖంగా విజృంభించే నీ మనస్సుకు ప్రాణాయామం బ్రేకువంటిది. ప్రాణాయామంవలన నువ్వు జ్ఞానివి కాకపోవచ్చు కాని కొంతవరకు మనస్సుయొక్క వేగమును ఆపుచేస్తుంది.

నాకు అజ్ఞానంలోనుండి బయటకు వచ్చేయాలి అని ఉంది, జ్ఞానమును సంపాదించుకోవాలని ఉంది అని ఒక భక్తుడు భగవాన్‌తో అన్నాడు. అజ్ఞానంలోనుండి బయటకు వస్తాను అంటున్నావు. అజ్ఞానం ఎవరికి ఉంది అన్నారు భగవాన్. నాకు ఉంది అంటున్నాడు. అజ్ఞానం ఉన్న ఆనేను ఎవడు? ఆ నేను అణిగిపోతేగాని నీకు అజ్ఞానంపోదు అన్నసంగతి నీ బుద్ధికి ఇంకా తెలియటంలేదు. ఆ నేనుయొక్క మూలం తెలియకుండా, ఆనేను ఎవరో తెలియకుండా అజ్ఞానంలోనుండి బయటకు రాలేవు. ఎందుచేతనంటే ఈ అజ్ఞానంకూడా ఆ నేనుకే. మనస్సుకు కొంచం శాంతివచ్చింది అనుకోండి, కుదురువచ్చింది అనుకోండి. మాకు ఇంక ఏమీ అక్కరలేదు ఒడ్డుకు వచ్చేసాము అనుకోవద్దు. అది మరల విజృంభిస్తుంది. మీ మనస్సుకు కొంచం కుదురు, శాంతి కలిగితే వాటి సహకారంతో మీ సాధనయొక్క లోతులను పెంచుకోండి. అన్ని విధములుగా భగవంతుని శరణువేడుకుంటే, మినహాయింపులు లేకుండా భగవంతుని శరణు వేడుకుంటే మనస్సు అణుగుతుంది. భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అనే విశ్వాసం మీకు ఉంటే శరణాగతిమార్గంలో గెంటుకొని గెంటుకొని ముందుకు వెళ్ళండి. దేవుడు ఉన్నాడా, లేడా అనే అనుమానం వస్తూఉంటే వారికి నేను ఎవడనుఅనే విచారణ మంచిది. శరణాగతిమార్గంలో ప్రయాణంచేసినా, విచారణామార్గంలో ప్రయాణంచేసినా పోగొట్టుకోవలసింది ఈ మిధ్యానేనునే. భగవదనుభవం కలిగేవరకు సాధనను ఆపుచేయవద్దు. ఈరోజు విషయంలో జాగ్రత్తగా ఉండు. రేపటిరోజు అదే జాగ్రత్తపడుతుంది. మనస్సుకు ఎప్పుడూ హృదయంలోనే ఉండాలని ఉంటుంది. కాని వాసనలు, సంస్కారములు హృదయంలో ఉండనివ్వకుండా బయటకు తీసుకొని వచ్చేస్తున్నాయి. ఏతలంపులు, ఏ వాసనలు జీవుడిని శిరస్సులోనికి తీసుకొనివస్తున్నాయో చూసుకొని ఆ వాసనలయొక్క ప్రభావమును తగ్గించండి. జీవుడు వాడి పుట్టిల్లుఅయిన హృదయంలో ఉన్నప్పుడు వాసన ఏమీ చేయలేదు. జీవుడు శిరస్సులోనికి వచ్చినపుడుమాత్రమే వాసన దాని ప్రభావమును చూపిస్తుంది. వాసనలయొక్క ప్రభావం తగ్గినపుడు జీవుడు హృదయంలో ఎక్కువకాలం ఉంటాడు.

గాఢనిద్రలో దేనితోనూ సంబంధంలేకుండా నీవు ఉన్నావు. గాఢనిద్రలో నేనులేను అని ఎవరూ చెప్పరు. గాఢనిద్రలో దేహంతోగాని, జన్మలతోగాని, దృశ్యములతోగాని, మనస్సుతోగాని సంబంధం లేకుండా నీవు ఉన్నావు. ఈ గొడవలు ఏమీ లేనపుడుకూడా నీవు ఉన్నావు. అదే ఆత్మ. అది ఉంది అని చెప్పటానికి

వేదాలతోటి, శాస్త్రములతోటి పని ఏముంది. ఋజువులతోను, సాక్ష్యాలతోను పని ఏముంది. మనం ఎవరిదగ్గరైనా ఏదైనా తీసుకొంటే అది జ్ఞాపకం ఉంచుకోవాలి. ఎదుటివారికి ఇచ్చినది మర్చిపోవాలి. మనం ఎవరి దగ్గరైనా తీసుకొన్నది జ్ఞాపకం పెట్టుకోవటంవలన కృతజ్ఞతాభావం కలుగుతుంది. ఇచ్చినది మర్చిపోవటంవలన అహంభావన తగ్గుతుంది. పెద్దసాధన ఏమీ చేయనక్కరలేదు నేను వాడకం తగ్గిస్తే అహంభావన నశిస్తుంది. సంసారం అంటే ఏమీలేదు ఈరోజు చేసిన పని రేపు చేయటం, రేపు చేసిన పని ఎల్లుండ చేయటం అలాగ చనిపోయేవరకూ అదేపని రిపీటెడ్‌గా చేయటం సంసారం. వాసనలోనుండి కోరిక వస్తుంది. కోరికవలన పనిచేస్తాము. పనివలన ఫలం వస్తుంది. కర్మఫలాన్ని మనం అనుభవిస్తాము. అనభవిస్తే మనకు వాసనపుడుతుంది. ఆవాసనలోనుండి కోరిక వస్తుంది. కోరికవలన పనిచేస్తాము. ఇది కర్మచక్రం. ఏ అవతారపురుషుని అనుగ్రహమో, సద్గురువు అనుగ్రహమో ఉంటేగాని ఈచక్రంనుండి బయటకు రాలేము. మీలోపల ఉన్న వాసనలు సన్నబడుతూఉంటే సుఖం, శాంతి తెలుస్తూ ఉంటుంది. గురువు చెప్పినదానిమీద పరిపూర్ణమైన విశ్వాసం ఉంటే నీకు సాధన చేయాలనే బుద్ధి కలుగుతుందిగాని విశ్వాసం సరిగాలేకపోతే నీ సాధన సాగదు.

మనం చేసేపని మనలను బంధిస్తుంది. ఎందుచేతనంటే కర్తృత్వంతో చేస్తాము. జ్ఞాని చేసేపని వాడిని బంధించదు. ఎందుచేతనంటే కర్తృత్వం లేదు. మా కర్మలే మాగొడవలే అడ్డువస్తున్నాయి అని మీరు చెపుతున్నారు. రోగం చెప్పి వదిలివేస్తే ఎలాగ దానికి మందుకూడా చెప్పండి, బాగుపడే ఉపాయం లేదా అని అడుగుతున్నారు. ఒకపద్ధతిప్రకారం నీకు అడ్డువచ్చేవి చెప్పాను. అంతేగాని వాటిని తొలగించుకోలేవు, వాటిని జయించే శక్తి నీకు లేదు అనిచెప్పటంలేదు. రోగం తగ్గేమందు లేకపోతే భయపడాలికాని మందుఉంటే భయపడవలసిన పనిలేదు. ఈకర్మ, విధి, పూర్వజన్మలు ఈ దేహానికి, లోకానికి సంబంధించిన గొడవలేకాని నీ స్వరూపంలో ఈచెత్త ఏమీలేదు అని చెప్పారు. దేహము మాత్రమే నేనుఅనే తలంపువలన ఈ గొడవలు అన్నీ వస్తున్నాయిగాని నీ స్వరూపంలో ఈస్పృష్టే లేదు. ఈ ప్రపంచాన్ని చూసి కంగారుపడవద్దు. ఇది ఒకనీడవంటిది. నీ నీడనుచూసి నువ్వు కంగారుపడటం ఎలాగ ఉంటుందో నీ కళ్ళకు కనబడే ప్రపంచాన్ని చూసి కంగారుపడటంకూడా అలాగే ఉంటుంది. ఇవిఅన్నీ నీమనస్సుకల్పించిన గొడవలు, నీ స్వరూపాన్ని బంధించేశక్తి కర్మకులేదు. సూర్యుడు కనబడకుండా మేఘం అడ్డురావవచ్చు. అంతమాత్రంచేత సూర్యుడుకంటే మేఘం గొప్పదిఅని అనుకోవద్దు. ఈ వాసనలు, తలంపులు జ్ఞానసూర్యుడు నీకు అనుభవంలోనికి రాకుండా అడ్డువస్తున్నాయి. అసలు వస్తువుకంటే ఇవిఏమీ గొప్పవికాదు. నువ్వు సాధనచేస్తూఉంటే, గురువు అనుగ్రహం ఉంటే అవి మోక్షం రాకుండా చేసేటంత గొప్పవి కాదు. నువ్వు సాధనచేస్తూఉంటే వాటంతట అవే రాలిపోతాయి. నీలోనువ్వు ప్రవేశించటానికి పిరికిపడవద్దు. ధైర్యంగా లోపలకు ప్రయాణం చెయ్యి. నీమీద నీకు విశ్వాసం లేకపోతే, నీకు ఎంతోకొంత ధైర్యం లేకపోతే, శాంతి లేకపోతే నీ హృదయంలోనికి ప్రవేశించలేవు. నీ ధైర్యమే నిన్ను హృదయంయొక్క లోతులలోనికి తీసుకొనిపోతుంది. నీకు ధైర్యంలేకపోతే నీవు హృదయంలోనికి వెళ్ళటానికి ప్రయత్నంచేస్తున్నప్పటికీ నీ అధైర్యమే నిన్ను హృదయంలో ప్రవేశించకుండా బయటకు విసిరివేస్తుంది.

భగవంతుని తెలుసుకోవటం కష్టంకాదు. భగవంతుని తెలుసుకోవటం కష్టం అని నీవు అనుకొంటున్నావుకదా అదే కష్టంక్రింద నీకు తయారవుతోంది. కష్టం అనుకొనేది కష్టం అసలుపని కష్టంకాదు. భగవదానుభవంపొందటం కష్టంకాదు. భగవదానుభవం పొందటం కష్టంఅని నీవు అనుకోవటం కష్టం. నీ హృదయంలో ఉన్న శక్తి నీకు తెలియకుండా ఏదో కర్మసిద్ధాంతం ఆపుచేస్తోందిఅని కంగారుపడి త్రొక్కిసలాడకు. నీ హృదయంలో ఉన్నశక్తి

చాలా అపూర్వమైనది, పవిత్రమైనది. ఆశక్తిని అగౌరవపరచవద్దు. ప్రపంచంలో ఏవస్తువునుకూడా దానిశక్తితో పోల్చలేము. నీ మనస్సును బాహ్యవిషయములనుండి ఉపసంహరించటంకోసం కొంత ప్రయత్నంచేస్తే ఆశక్తి నీమనస్సును లోపలకు లాగేసుకొని దానిస్వరూపాన్ని ఇస్తుంది. మనం సాధనచేసి దానిని పొందుతున్నాము అనిపిస్తుంది. మన సాధనవలన దానిని తెలుసుకోలేము. దాని స్వరూపాన్ని మనకు తెలియపర్చాలని అది అనుకొంటుంది. అదే మనలను ఆకర్షించుకొంటుంది, చెంతకు చేర్చుకొంటుంది. దాని స్వరూపాన్ని అదే మనకు తెలియపరుస్తుంది. అది జరిగే క్రియ. కాని ముక్కు మూసుకొంటున్నాను అందుకని నాకు తెలిసిపోతోంది అని నీకు అనిపిస్తుంది. దేవుడికి మనకి 10 అడుగులు దూరం అనుకో, నీవుచేసే పూజ, జపం ఒక అడుగుతో సమానం. ఒక్క అడుగు నీవు ముందుకు వేస్తే భగవంతుడు 9 అడుగులువేసి ఎదరకు వస్తాడు. నీవు వేసే ఒక్క అడుగు నీకు తెలుస్తోంది. దానివలన దేవుని తెలుసుకొంటున్నానని అనుకొంటున్నావు. నీ సాధనవలన ఆయన తెలియబడడు కేవలం ఆయన అనుగ్రహంవలననే ఆయనను తెలుకోగలము.

మనం లోపలనుండి వచ్చాము. బాహ్యానికి పడిపోయాము. మీరు లోపలనుండి వచ్చారు అని మీకు తెలుస్తోంది. గాని ఎక్కడనుండి వచ్చారో మీకు తెలియటంలేదు. ఆ వచ్చినచోటుకు వెళ్ళటమే మన జీవితగమ్యం. సాధనచేసి చైతన్యం దగ్గరకు కొంచం, కొంచం జరుగుతూ ఉంటే నన్ను చేరుకోవటానికి కష్టపడుతున్నాడు అని మన ప్రయత్నంచూసి వీడు ఏమి జరుగుతాడుఅని చెయ్యిపట్టుకొని ఆయనే లోపలకు లాగేసుకొంటాడు. ఆయనచేతికి ఎప్పుడైతే దొరికావో నీ ప్రయత్నం లేకుండా సాధన సాగిపోతుంది, ఆయన చెంతకు చేర్చుకొని ఆయన స్వరూపాన్ని ఇస్తాడు. మిథ్యానేనేకదా పునర్జన్మకు కారణం. ఇది స్మశానంలో కాలిపోతే మనం సాధన ఏమీ చేయనక్కరలేదు. వీడు కాలడని భగవంతునికి తెలుసు. చెంతకు రమ్మంటాడు, బుజ్జగిస్తాడు, మర్యాద చేస్తాడు. దగ్గరకు రమ్మంటాడు, ఇంకా దగ్గరకు రమ్మంటాడు. దగ్గరకు వచ్చిన తరువాత మీకు తెలియకుండానే మిథ్యానేనును మ్రింగేసి ఏమీ తెలియనట్లు ఊరుకొంటాడు. అప్పుడు మీరు జ్ఞానులుఅయిపోతారు. మిథ్యానేనును మ్రింగేస్తాడుఅని మీకు తెలియదు. మీకు తెలిస్తే ఆయనదగ్గరకు వెళ్ళరు. కర్మఅనుభవించేవాడిని మ్రింగేసినపుడు ఇంక నీకు కర్మగొడవ ఉండదు. మీ సాధన సహజం అయిపోయింది అనుకోండి. వాడు మిథ్యానేనును మ్రింగేయటానికి రెడీగా ఉన్నాడు అనుకోండి. అప్పుడు మీరు మీ తెలివితేటలు ఉపయోగించి ప్రక్కకి తప్పుకోవటానికి చూస్తారు అనుకోండి. ఆటైములో తప్పుకోవటానికి మీకు అవకాశం లేదు. అది ముందే మీరు ఆలోచించుకోండి. ఈ నేనును వాడు నమలడు, మింగేస్తాడు. మింగేసి వాడి స్వరూపాన్ని మీకు ఇస్తాడు. సాధనచేసి ఇంతదూరం వచ్చేసాను. రమణస్వామి చెంతకు చేరాను. ఇప్పుడు రమణస్వామియొక్క అనుగ్రహవలలోనుండి బయటకు పోవాలని, నా మామూలు జీవితంలోనికి వెళ్ళిపోవాలని అనుకొంటున్నాను. కాని ఈ అనుగ్రహంఅనే వలలోనుండి బయటకు పోవటానికి నా శక్తి చాలటంలేదు. ఈ గురువు మంచివాడే, ప్రేమిస్తున్నాడు. కాని ఆ ప్రేమలో కొంత క్రూరత్వం ఉంది. ఆ క్రూరత్వం ఏమిటి అంటే నేనును నాకు కాకుండా చేస్తున్నాడు. నన్నే తినేస్తున్నాడు కాబట్టి ఈయన దయలేని ప్రేమికుడు అంటున్నాడు ఒక సాధకుడు. నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను. మీమీద నాకు ప్రేమ కలుగుతోంది అని తెలుస్తోంది. ఎందుకు మీమీద ప్రేమ కలుగుతోంది అని ఒక భక్తుడు భగవాన్‌ని అడిగాడు. ఏ కారణంవలన ఈభూమిమీద పుట్టావో ఆ కారణంవలననే నామీద నీకు ప్రేమ కలుగుతోంది. నువ్వు పుట్టిన కారణం వేరు నామీద ప్రేమకలగటానికి కారణం వేరుకాదు. అంటే నువ్వు పుట్టటం, నాయందు నీకు ప్రేమకలగటం ఆ ప్రేమద్వారా నీవు తరించటంఅనేది ఈశ్వరుడు ప్రణాళికలో రచించి నిన్ను ఈభూమిమీదకు పంపాడు. ఆ ప్రణాళికననుసరించి నామీద నీకు ప్రేమ కలుగుతోంది. ఈ ప్రేమద్వారా ఈశ్వరుడు నిన్ను తరింపజేస్తాడు.